క్లుప్తంగా

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. అమడాల, గుంజలపాడు, జోళదరాశి, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లి, కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.
సంజామల: మండల పరిధిలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఈ వారం పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, వసంతాపురం, ఆల్వకొండ, రెడ్డిపల్లె, కమలపురి, కానాల, గిద్దలూరు, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నెకు గ్రామాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సంజామల: మండలంలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. సుమారు 1500 మందికి గుండె, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, బీపీ, షుగర్, చర్మం, కీళ్ల వ్యాధులపై వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి, మౌలాలి రెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ సేవా సమితికి ఆర్థిక సహాయం



సమితి సభ్యులను అభినందిస్తున్న సీఐ, ఎస్ఐ

బేతంచెర్ల: మండలంలో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించే వైకుంఠ సేవా సమితికి బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సమాజ సేవలో భాగమై ముందుకు సాగాలని సమితి సభ్యులకు సూచించారు. సమాజం కోసం చేసే ప్రతి సేవా కార్యక్రమానికి తమవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

సీఐఎస్ఎఫ్ జవానుకు నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్ టౌన్: చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాను పరంధాముడు మృతిపై వైఎస్సార్‌సీపీ సంతాపం వ్యక్తం చేసింది. ఈయన ఢిల్లీలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు భవనం నుంచి జారి కిందపడడంతో మృతి చెందారు. భౌతికకాయాన్ని ఆదివారం గ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, బద్దల నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు మహేశ్వర్‌రెడ్డి, డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులు రంగస్వామి, నాగలక్ష్మమ్మ, భార్య సువర్ణ, పిల్లలకు ధైర్యం చెప్పి సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

బనగానపల్లె రూరల్: పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు ఆదివారం ప్రారంభించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా స్థానిక పాదుపు భవనంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, నాయకులు హరికృష్ణగౌడ్, బచ్చు శరత్ చంద్రకుమార్, శివకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

డోన్ టౌన్: గత ప్రభుత్వ హయాంలో పేదలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో కోట్ల రూపాయలు వెచ్చించి వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేసి సేవలు ప్రారంభిస్తే డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పేదలకు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. డోన్ ప్రభుత్వ వైద్యశాలకు వంద పడకల స్థాయి పెంచాక డోన్ మండలం, పట్టణ ప్రజలతో పాటు ఇతర మండలాల నుంచి అధిక సంఖ్యలో వైద్యం కోసం డోన్‌కు తరలివస్తున్నారని తెలిపారు. అయితే ఇక్కడ వైద్యం అందించాల్సిన డాక్టర్లు కేవలం ఓపీలో మందులు రాయడానికే పరిమితం అయ్యారని ఆరోపించారు. కర్నూలుకు రెఫర్ చేయడం పరిపాటిగా మారిందన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎవరు అధైర్యపడొద్దు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని, ఎవరూ అధైర్యపడవద్దని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తన స్వగృహంలో అన్యాయానికి గురవుతున్న కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్‌బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి సమావేశంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ డిజిటల్‌బుక్‌ను ఆవిష్కరించారని తెలిపారు. గత 15 నెలలుగా కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు, పోలీస్ స్టేషన్లలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం, సోషల్ మీడియా నాయకులపై తప్పుడు కేసులు, థర్డ్ డిగ్రీ హింసలన్నీ ఈ డిజిటల్‌బుక్‌లో లిఖించబడ్డాయని తెలిపారు. ఇది కార్యకర్తలకు మనోధైర్యం కల్పిస్తుందని అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రలో క్రిమినల్ కేసులున్న వారికే పదవులు ఇస్తామని అన్నారని, నేడు కూటమి ప్రభుత్వం అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. మాజీ సీఎం జగన్ మొదటి నుంచి ప్రజల కోసం పోరాడుతున్నారని, గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 40 శాతం ఓట్లు సాధించినా అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని అన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో జగన్‌ను సైకో అని పిలవడం, చిరంజీవిపై విమర్శలు చేయడం సబబుకాదన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహెద్ హుస్సేన్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్‌రెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ అబ్దుల్ ఖైర్, మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు అనిల్, నాయకులు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, తోటబుచ్చిరెడ్డి, ఈశ్వర్‌నాయక్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం

రాష్ట్రంలో యూరియా సమస్య తీవ్రంగా ఉందని, ఉల్లి, టమాట పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు రోడ్లపై పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అరకొరగా అమలు చేసి, పూర్తిగా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపిందని, మళ్లీ రూ.12 వేల కోట్ల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన తయారైందని తెలిపారు. అలాగే మైనింగ్, ఇసుక దోపిడీలు ఎక్కువయ్యాయని అన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు నోటీసులు ఇచ్చి అక్రమ లేఅవుట్ల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న వారిని వదలబోమని హెచ్చరించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా



డోన్: డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ రూపొందించిన డిజిటల్ బుక్ పార్టీ కార్యకర్తలకు భరోసా ఇస్తుందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డోన్ మండల అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, ప్యాపిలి, బేతంచెర్ల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పోతుదొడ్డి కృష్ణమూర్తి, తిరుమలేశ్వర్‌రెడ్డితో కలిసి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా చేసుకుని దాడులు, బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. అధికార పార్టీ అండ చూసుకుని అధికారులు కూడా చెలరేగిపోతున్నారని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమపై జరుగుతున్న దౌర్జన్యాలు, దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని తెలిపారు. 2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, బేతంచెర్ల టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుసేన్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎద్దులన్న, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి జ్ఞాపకాలు.. తీపి గుర్తులు



డోన్: 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

డోన్: దాదాపు 40 ఏళ్ల తర్వాత వారంతా చదువులమ్మ ఒడిలో మళ్లీ కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ సంబరపడ్డారు. అప్పటి గురువులు.. చదువులను గుర్తు చేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. ఇందుకు డోన్ ప్రభుత్వ జెడ్పీ బాలికల పాఠశాల వేదికైంది. ఆదివారం 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సుజనప్రభ, నిర్మల కుమారి, దానమ్మ, వాసు, రత్నకుమారి, ప్రభకుమారి, సుధ, జయరాం, జయలక్ష్మి, విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, సీతారామయ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుత్తి మాజీ ఎమ్మెల్యే కోట్రికె మధుసూదన్ గుప్తా సతీమణి అపర్ణ, 14వ వార్డు కౌన్సిలర్ టమకం లక్ష్మీదేవి, ఆలా హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల: ఒకే వేదికపై 1998-99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

జ్ఞాపకాల జడివాన..!

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పదో తరగతి చదివిన 50 మంది విద్యార్థులు ఒకే వేదికపై చేరారు. వీరంతా ఉన్నత చదువులు చదివి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. వారంతా ఒకచోట చేరి అప్పటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులు ఈశ్వరరెడ్డి, వెంకటరమణ, జీవీ సుబ్బారెడ్డి, బ్రహ్మయ్య, రాఘవయ్య, డ్రాయింగ్ సుబ్బారెడ్డి, జగన్, స్వయంప్రభ, కాశయ్య, రమణయ్య, ఓబులేసు, రామలింగయ్యను ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు శ్యాంబాబు, విక్రమ్, సుబ్బారెడ్డి, అంగలింగమయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ఆదర్శ హైస్కూల్‌కు చెందిన 2008–09 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం బెలుం గుహల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో కలుసుకున్నారు. 16 ఏళ్ల తర్వాత ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకునే సమయంలో గడిపిన సంతోషకరమైన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ ఉన్నతి కారణమైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



డోన్: జాషువ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కోవెలకుంట్ల: జాషువాకు నివాళి

డోన్ టౌన్: అంటరానితనం, కుల వివక్ష నిర్మూలించడానికి తన కవిత్వాన్ని ఆయుధంగా మలచి ఉద్యమాన్ని తీసుకొచ్చిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ అందరికీ స్ఫూర్తిదాయకుడు అని తొగట సురేష్‌బాబు, సాహితీవేత్త డాక్టర్ దేవేంద్రప్ప అన్నారు. ఆదివారం స్థానిక రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు రామ్మోహన్, రమణ, మౌలాలి, విశ్వనాథ్, కిరణ్, మద్దిలేటి, రామదాసు, రామాంజనేయులు, మోహన్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.
కోవెలకుంట్ల: స్థానిక పరంధామ నిలయంలో ఆదివారం గుర్రం జాషువా 130వ జయంతిని నిర్వహించారు. రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజల జీవితం, సాధారణ అనుభవాలను ప్రతిబింబిస్తూ సమాజానికి స్ఫూర్తినిచ్చే విధంగా జాషువా కవిత్వం ఉంటుందన్నారు. ప్రకృతి పీఠం సభ్యులు రాములమ్మ, మేరి, జోసఫ్ పాల్గొన్నారు.

● పరాశక్తి ధన్యోస్మి



బేతంచెర్ల: సహస్ర దీపాలంకరణ సేవలో మహాలక్ష్మీ



సంజామలలో లలితాత్రిపుర సుందరి అలంకరణ



బేతంచెర్లలో మహాచండీదేవిగా వాసవీమాత



సీతారామాపురంలో దుర్గామాత



బేతంచెర్లలో సింహవాహనంపై వేంకటేశ్వరస్వామి



కోవెలకుంట్ల: గజలక్ష్మీదేవిగా వాసవీమాత



కోవెలకుంట్ల: మహా చండీదేవిగా మారెమ్మ



అవుకులో ధనలక్ష్మి అలంకరణ



ప్యాపిలి: మహాలక్ష్మి అలంకారంలో వాసవీమాత



డోన్: అమ్మవారిశాలలో స్కందమాతగా.

డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



పూజల్లో పాల్గొన్న చల్లా విఘ్నేశ్వరరెడ్డి

కల్యాణ వైభోగం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం మైన్స్‌అండ్ జియాలజీ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామికి పురోహితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రామ్‌కో సిమెంట్ యూనిట్‌హెడ్ మీనాక్షిసుందరం కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

బనగానపల్లె: పట్టణంలోని కాటసాని రామిరెడ్డి స్వగృహంలో ఆయన అధ్యక్షతన సోమవారం వైఎస్సార్‌సీపీ బనగానపల్లె మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొనాలని పేర్కొన్నారు.

పట్టుదలతో చదివారు.. లక్ష్యాన్ని సాధించారు



కుమార్తెలు, కుమార్తెతో తల్లిదండ్రులు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ చిన్ని కృష్ణ, పరమేశ్వరి దంపతుల ముగ్గురు సంతానం కృషితో రాణించారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో 74.50 మార్కులు సాధించిన పెద్ద కుమార్తె మానిక ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా నియామకపత్రం అందుకున్నారు. రెండో కుమార్తె సాయిశ్రీ 2022 నవంబర్‌లో వైద్య విద్య పూర్తిచేసి ఈ ఏడాది జూన్‌లో ప్రభుత్వ వైద్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. చిన్న కుమారుడు మనోజ్ డిగ్రీ పూర్తిచేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. పిల్లలు ముగ్గురూ ఉన్నత స్థాయిలో రాణించడంపై తల్లిదండ్రులను పలువురు ఆదివారం అభినందించారు. తల్లిదండ్రుల కష్టాన్ని వమ్ము చేయకుండా పట్టుదలతో చదివితే ఎవరైనా లక్ష్యాలను సాధించవచ్చని నిరూపించారని పేర్కొన్నారు.

రేబిస్‌పై అప్రమత్తత అవసరం



కుక్కలకు రేబిస్ టీకా వేస్తున్న పశువైద్యుడు

బనగానపల్లె రూరల్: రేబిస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మారుతిసకారమ్ అన్నారు. ఆదివారం స్థానిక పశువైద్యశాలలో ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుక్కల యజమానులు తప్పనిసరిగా తమ పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని, దీని ద్వారా కుక్కల ఆరోగ్యంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా సంరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలకు టీకాలు తప్పనిసరి

సంజామల: కుక్కల ద్వారా వచ్చే రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏహెచ్‌ఏ మహబూబ్ బేగ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏరియా పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా శునకాలకు రేబిస్ టీకాలు వేశారు. కుక్కలతో ప్రమాదకరమైన వ్యాధి వస్తుందని, కుక్క కాటుకు గురైన వారు తక్షణం జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సంజామలలో దాదాపు 30 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని మిడుతూరు రోడ్డు వైపు ఈనెల 10వ తేదీ పంట పొలాలలో గడ్డి మందు తాగి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓర్వకల్లు మండలం, నన్నూర్ గ్రామానికి చెందిన షేక్ ఖాజాబాషా(30) కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. భార్య పుట్టింటికి చెప్పకుండా వెళ్లిందని గొడవ పడి ఎవరికి చెప్పకుండా బయటికి వచ్చాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



డోన్: భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నేతలు

బనగానపల్లె రూరల్: స్వాతంత్ర్య విప్లవవీరుడు సర్దార్ భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులుఅర్పించారు. దేశంలో సోషలిస్టు రాజ్యం, సమసమాజం కోసం ఆయన శ్రమించారని తెలిపారు. ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి చందు, మాధవ్, సీపీఐ నాయకులు శివయ్య, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తిదాయకుడని..స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, సూర్యప్రతాప్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ స్ఫూర్తితో మెడికల్ కళాశాలల కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డోన్ మండల అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అస్లాం, ధనూష్, నాయకులు మహేష్, అక్రం, వెంకీ, మనోహర్ పాల్గొన్నారు.